సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సన్మానిస్తున్న కాలనీ వాసులు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దుండిగల్: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కుత్బుల్లాపూర్ మండల వైద్యాధికారిణి డాక్టర్ స్వర్ణలత అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోగాలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఏదైనా జబ్బు చేస్తే వైద్యుల పరిరక్షణలో చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి మహ్మద్ సిరాజుద్దీన్, హెల్త్ నర్స్ లతీఫ్, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లో అకస్మాత్తుగా మంటలు



మంటలు ఆర్పుతున్న పోలీసులు

జగద్గిరిగుట్ట: బైక్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో వాహనం బూడిదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌కు చెందిన సంతోష్ (22) బైక్ మెకానిక్. బైక్ మరమ్మతులకు సంబంధించిన విభాగాలను జగద్గిరిగుట్ట ఔట్‌పోస్ట్ సమీపంలోని ఓం సాయి ఆటోమొబైల్స్ షాపులో తీసుకున్నాడు. తిరిగి వెళ్లేందుకు బైక్‌ను స్టార్ట్ చేయగా సైలెన్సర్ నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. దీంతో బైక్‌ను వదిలి సంతోష్ పక్కకి జరిగాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న జగద్గిరిగుట్ట ఎస్‌ఐ మహేందర్ రెడ్డి స్థానికుల సాయంతో మంటలార్పారు. అప్పటికే బైక్ పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

కూకట్‌పల్లి: ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలానగర్ డివిజన్ ఇందిరానగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకులు పుట్టపాగ మధు, బాలరాజు, కురుమయ్యతో సహా 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకుడు గిరి ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ.. నాడు బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన అభివృద్ధే నేడు కనిపిస్తుందని, నేటి కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ పరిపాలన చూసి ప్రజలు విసుగెత్తిపోయారని, అందుకే అభివృద్ధికి పట్టం కట్టాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు తదితరులు

రాజీవ్ యువ వికాసం @8 కేంద్రాలు

- ఈ నెల 14 వరకు అవకాశం
- ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తుల స్వీకరణ

కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు





కుత్బుల్లాపూర్: రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈనెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేసి మండల తహసీల్దార్లకు అందజేస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఇప్పటికే ప్రచారం చేసి దరఖాస్తుల స్వీకరణకు వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రాజెక్టు అధికారుల పర్యవేక్షణలో రిసోర్స్ పర్సన్లు దరఖాస్తులు స్వీకరించి ప్రతిరోజు వార్డుల వారీగా ఉన్నతాధికారులకు పంపనున్నారు. ప్రతి కౌంటర్‌కు ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో..

కుత్బుల్లాపూర్ సర్కిల్ 25 పరిధిలోని రంగారెడ్డి నగర్ డివిజన్‌లో గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, సుభాష్ నగర్ డివిజన్‌లో గణేష్ గ్రౌండ్ సుభాష్ నగర్, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో పద్మానగర్ రింగ్ రోడ్డు శివాలయం టెంపుల్ సమీపంలో, జీడిమెట్ల డివిజన్ గాయత్రి నగర్ వార్డు కార్యాలయంలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఉప కమిషనర్ నరసింహ తెలిపారు.

గాజులరామారం సర్కిల్‌లో..

గాజులరామారం సర్కిల్ పరిధిలో 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గాజులరామారం డివిజన్ మహాదేవపురం వార్డు కార్యాలయంలో, జగద్గిరిగుట్ట డివిజన్ మోడల్ మార్కెట్ వార్డు కార్యాలయం, చింతల్ డివిజన్ జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ భగత్ సింగ్ నగర్, సూరారం డివిజన్ నెహ్రూ నగర్ కమ్యూనిటీ హాల్ వార్డు కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వ ఆదేశాలతో జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నట్లు ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహులు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 208 దరఖాస్తులు, గాజులరామారం సర్కిల్లో 184 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటి వివరాలను వార్డు కార్యాలయాల్లో అందజేయాలని కోరారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

దరఖాస్తుతో పాటు ఇవి కూడా...

నియోజకవర్గ పరిధిలోని రెండు జంట సర్కిళ్ల పరిధిలో దరఖాస్తు చేసుకునేవారు ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ సరిఫికెట్స్ ఏప్రిల్ 2024 నుంచి లేటెస్ట్ గా ఉండాలి. పాన్ కార్డు, దరఖాస్తుదారుడి ఫొటో, మొబైల్ నెంబర్, రేషన్ కార్డులో ఉన్న సభ్యుల్లో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుంది.

ఉపాధి అవకాశాలు

నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం 75 రకాల దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఇందులో పంపుసెట్లు, ఎయిర్ కంప్రెసర్, ఆవులు, గేదెలు, చేపలు పెంపకం, పాల వ్యాపారం, పౌల్ట్రీ ఫారం, బేకరీ, హెయిర్ కటింగ్ షాప్, బ్యూటీ పార్లర్, ఎలక్ట్రికల్ షాప్, డిష్ టీవీలో ఏర్పాటు, జనరల్ స్టోర్, పండ్ల దుకాణం, గిఫ్ట్ ఆరికల్ షాప్, ఐస్ క్రీమ్ పార్లర్, హోటల్, మినీ సూపర్ బజార్, చీరల వ్యాపారం, స్వీట్ షాప్.. ఇలా 75 రకాల షాపుల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఈ పథకంలో లబ్ధిదారులకు 60 నుంచి 80 శాతం వరకు రాయితీతో కూడిన రుణాలను ప్రభుత్వం అందించనుంది.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు కూన శ్రీశైలంగౌడ్, నర్సారెడ్డి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్: బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని, రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జై బాపు..జై భీమ్..జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ ఉస్మా షాకీర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పందరి రావు, మహిళా అధ్యక్షురాలు కమల, మైనారిటీ ప్రెసిడెంట్ మహ్మద్ అమీర్ సుల్తాన్, జేమ్స్, టిల్లు, నాగరాజు, అరుణ్, బిల్లా, పృథ్వీ, నజీర్, విజయ్, నాగమణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ డివిజన్‌లో..

కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని ద్వారకా నగర్, మార్కెట్ యార్డ్, కాకతీయ నగర్, మాణిక్య నగర్, అంబేద్కర్‌నగర్, శ్రీనివాస్‌నగర్, శ్రీరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎండీ జాకీర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, కృష్ణ యాదవ్, రాధాకృష్ణ, పెంటయ్య, సిద్ధయ్య, సుజాత, అశ్విని, హేమావతి, సంగీత, అంకిత, లత, శ్రీను, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న కొలన్ హన్మంత్‌రెడ్డి

రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో తల్లీపిల్లలకు వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్‌లు' అనే నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ తల్లి, పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ సందర్భంగా రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో సోమవారం తల్లి, పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఉచిత వైద్య శిబిరం కొనసాగింది. గైనకాలజీ కన్సల్టేషన్, పిడియాట్రిక్ కన్సల్టేషన్, మామోగ్రఫీ, హెచ్‌పీవీ వాక్సినేషన్ (మొదటి డోస్) జీఆర్‌బీఎస్, పాప్ స్మియర్ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఛాయాదేవి మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా కుటుంబం, దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని దివ్య, యాజమాన్యం విక్రందేవ్ రావ్, మీరా రావ్, ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావ్, ఎండీ డాక్టర్ కె. కమలాకర్‌రావు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కార్పొరేటర్ నర్సింహయాదవ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట ప్రధాన రహదారిలోని నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు బాలమ్మ, మహేష్, రవి, శ్యాంసుందర్, మోహన్, పరమేష్, విఠల్, నరేష్, నాగేందర్, మధు, శ్రీనివాస్ సహకారంతో కమ్యూనిటీ హాల్‌ను ఆలయ ప్రాంగణంలో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్రె జంగయ్య, మన్నె ఉదయ్‌యాదవ్, గడ్డం నర్సింగ్‌రావు, బాలరాజు, మక్కాల సత్యనారాయణ, బుర్రి యాదగిరి, పోచయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులతో సామాజిక వేత్త మధుబాబు, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు విజయ్ కుమార్

జగద్గిరిగుట్ట : హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ, కేజీఎన్ ఫార్మసీ ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్ ప్రకాశం పంతులు నగర్‌లోని ఏఎంఎస్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు – ఆశాజనక భవిష్యత్‌లు 'అనే అంశం పై పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా సామాజికవేత్త మధుబాబు చికిలే పిల్లలకు ఆహారం విలువ, ఆరోగ్య అక్షరాస్యత గురించి తెలియజేశారు. శీతల పానీయాలకు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే షాపూర్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవనీతను ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని సన్మానించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్, సభ్యులు నగేష్, పాఠశాల కరెస్పాండెంట్ సయ్యద్ ఇమ్రాన్, పట్టణ కేంద్రం కార్యక్రమంలో దేవి, అమృత, శ్యామల, లావణ్య, పద్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు

జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలి



భవన నిర్మాణ కార్మికులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: రోడ్డు దాటే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని, జీబ్రా క్రాసింగ్‌ల వద్దనే రోడ్డు దాటాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. గుండ్లపోచంపల్లి, అయోధ్యలో భవన నిర్మాణ కార్మికులు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌లు లేని ప్రాంతాల్లో వాహనాలను గమనిస్తూ చేతితో సిగ్నల్ ఇస్తూ దాటాలన్నారు. రోడ్డు దాటే క్రమంలో మొబైల్ ఫోన్‌లు వాడరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉంటే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలో ప్రతిభ



మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: జాతీయ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి సత్తా చాటారు. ఐదు పతకాలు సాధించారు. ఈ నెల 6, 7 తేదీల్లో పంజాబ్ మొహాలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 7వ జాతీయ మాస్టర్స్ గేమ్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. 81 ఏళ్ల వయస్సులో మర్రి లక్ష్మణ్ రెడ్డి వీటిని సాధించడం విశేషం. 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో బంగారు పతకం, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు పతకం, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో వెండి పతకం, రిలే ఈవెంట్‌లో రెండు కాంస్య పతకాలు సాధించారు.

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కొలువుదీరిన స్వామి వారు

జగద్గిరిగుట్ట: చింతల్, పద్మానగర్ ఫేజ్ 1, శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. మంగళవారం పుణ్యాహవచనం, రక్షాబంధనం, శాత్తుములు, 9న శాంతి పాఠం, ద్వారతోరణ పూజ, బలిహరణం, 10న మంగళాశసనం, మూర్తి కుంభ ఆరాధన, 11న తిరు కల్యాణ మహోత్సవం, అన్నదానం, 12న కుంకుమార్చన, నిత్య హోమం, 13న చతుస్థాన అర్చన, యాగశాల బలిహరణ, చక్రస్నానం, ధ్వజ అవరోహన, సప్తవరణం, ఆశీర్వచనం తదితర పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



ఇలాగుంటే జారుడే..

ప్రధాన రోడ్లపై పేరుకుపోయిన మట్టితో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. బాలానగర్ నుంచి ఐడీపీఎల్‌కు వెళ్లే రోడ్డు మార్గంలోని ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో మట్టి పేరుకుపోయింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. అధికారులు స్పందించి మట్టిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

– రంగారెడ్డినగర్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

నిజాంపేట్: చలివేంద్రాలతో బాటసారుల దాహార్తి తీరుతుందని, ఇలాంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. సోమవారం బాచుపల్లిలో మద్దిరెడ్డి గారి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాసాని సుధాకర్, బీఆర్ఎస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 82 ఫిర్యాదులు!

- ఆక్రమణలు, సంక్షేమ పథకాలపై దరఖాస్తులు
- వేతనాలపై పంచాయతీ కార్మికులు
- సర్వే చేసిన డబ్బుల కోసం సిబ్బంది మొర



ఫిర్యాదులను స్వీకరిస్తున్న, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డికి 82 ఫిర్యాదులను అందజేశారు.

- వివిధ ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు సంక్షేమ పథకాలకు సంబంధించి పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు.
- భూకబ్జాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై 23 ఫిర్యాదులు రాగా.. అక్రమ భవన నిర్మాణాలు, అనుమతి లేకుండా బహుళ అంతస్తుల కట్టడాలపై అత్యధికంగా 34 ఫిర్యాదులు వచ్చాయి.
- నాగారం, దమ్మాయిగూడ, ఫీర్జాదిగూడ, పోచారం, మేడ్చల్, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, కొంపెల్లి, తూముకుంట పురపాలక సంఘాలతో పాటు ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లకు సంబంధించిన వాటిపై పెద్దఎత్తున ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చాయి.
- ఇరిగేషన్‌పై ఐదు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు సంబంధించి 4 ఫిర్యాదులు, హౌసింగ్, పంచాయతీ, మల్కాజిగిరి, కీసర ఆర్డీఓలు, మెప్మా, విద్య, పోలీసుశాఖలకు సంబంధించినవి కూడా ప్రజావాణిలో సంబంధిత అధికారులకు స్థానికులు ఫిర్యాదులు అందజేశారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌డీఏ సాంబశివరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

చింతల్: కుత్బుల్లాపూర్ కార్యాలయంలో సోమవారం డీజీఎం రాజేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు వచ్చాయి. చింతల్ సెక్షన్ వేంకటేశ్వరనగర్ నుంచి నూతన తాగునీటి పైపులైన్ వేయాలని, సుచిత్ర సెక్షన్ దత్తాత్రేయనగర్‌లో పది రోజులుగా నీరు సరఫరా రావడం లేదని, జీడిమెట్ల సెక్షన్ సాయిబాబానగర్‌లో బోర్‌వెల్‌కు మరమ్మతులు చేపట్టాలని ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో డీజీఎంలు, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

నిజాంపేట్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల స్థలాన్ని హెచ్‌సీయూకే ఇవ్వాలని ఆకుల సతీష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ముఖేష్, ఇంద్రపాల్‌యాదవ్, అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి..

వివిధ శాఖల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలి. వినతులపై చేపట్టిన చర్యలను ప్రజలకు వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలి.

– విజయేందర్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్